సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



చిన్నబోయిన చీమలపాడు

చీమలపాడులో జరిగిన పేలుడు ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. స్థానికులు ఇంకా ఆందోళన నుంచి తేరుకోలేకపోతున్నారు. 8లో



ఆర్టీసీకి వడదెబ్బ!

ఎండల తీవ్రతతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారి సంఖ్య తగ్గుతుండగా అదేస్థాయిలో ఆదాయం పడిపోతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తీవ్రంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సా) 6.31
సహర్ (శనివారం ఉ) 4.31

కొనుగోళ్లకు శ్రీకారం

- జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- కల్లూరు మండలంలో రెండు చోట్ల ఏర్పాటు
- దశలవారీగా తెరుచుకోనున్న 230 కొనుగోలు కేంద్రాలు
- కమీషన్ బకాయిలతో నిర్వాహకుల వెనకడుగు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. వరికోతలు మొదలైన ప్రాంతాల్లో దశల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని పౌర సరఫరాల సంస్థ భావిస్తోంది. ఈ యాసంగిలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా నిర్దేశించగా, కల్లూరు మండలంలోని రెండు రెండు కేంద్రాలను గురువారం తెరిచారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం ఈ కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు.

డిమాండ్‌కు అనుగుణంగా..

జిల్లాలో యాసంగిలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 230 కేంద్రాలు ఏర్పాటుచేయనుండగా.. ఇందులో పీఏసీఎస్‌ల ద్వారా 150, ఐకేపీ 48, డీసీఎంఎస్ 28, మార్కెటింగ్ శాఖ నాలుగు కేంద్రాలు ఏర్పాటవుతాయి. కేంద్రాల నిర్వహణపై కలెక్టర్ ఇప్పటికే జిల్లా పౌరసరఫరాల సంస్థ, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, సహకార, రవాణశాఖ అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు.

అంతా సిద్ధం..

ఎండలు మండిపోతున్న నేపథ్యాన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించనున్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్ల సౌకర్యం కల్పించనున్నారు. అలాగే, 58,39,037 గన్నీ బ్యాగులు ఇప్పటికే సేకరించారు. అంతేకాకుండా టార్పాలిన్లు, తూకం, తేమ పరీక్ష యంత్రాలు, డేటా ఎంట్రీ ట్యాబ్‌లు ఇతరత్రా అన్నీ సిద్ధం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా లారీలు సమకూర్చనున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, డీఆర్డీఓ విద్యాచందన తదితరులు

కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు రావాల్సిన కమీషన్ వివరాలు

సీజన్	కొనుగోలు కేంద్రాలు	కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)	రావాల్సిన కమీషన్
2021-22 (వానాకాలం)	50	5,84,135.20	రూ.1,84,85,691.50
2021-22 (యాసంగి)	50	1,67,728.40	రూ.53,61,655.84
2022-23 (వానాకాలం)	53	5,67,903.20	రూ.1,78,45,216
మొత్తం	153	13,19,766.8	రూ.4,16,92,463.34

రూ.4.16 కోట్ల కమీషన్ బకాయి

2021-22 ఏడాది వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన వారికి కమీషన్ బకాయి ఉంది. ఈ క్రమంలో తమకు బకాయిలు చెల్లిస్తేనే ఈసారి కేంద్రాలు ఏర్పాటుచేస్తామని వారు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 153 కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు 13,19,766.8 మెట్రిక్ టన్నుల ధాన్యంకు సంబంధించిన రూ.4,16,92,463 కమీషన్ అందాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యాన బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

నాలుగు లక్షల మె.టన్నుల లక్ష్యం

ప్రస్తుత యాసంగిలో 2,05,762 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈమేరకు 5,08,645 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. స్థానిక అవసరాలకు 54,627 మెట్రిక్ టన్నులు, విత్తనాల కోసం మరో 20 వేల మెట్రిక్ టన్నులు పోగా.. మిగిలిన 4,34,018 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నారు. ఇందులో 34,018 మెట్రిక్ టన్నులు మిల్లర్లు కొనుగోలు చేయనుండగా, మిగతా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల ద్వారా సేకరించాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది.

కోతలు మొదలైన చోట కేంద్రాలు



యాసంగికి సంబంధించి కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర, హన్మతండాలో లాంఛనంగా రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. వరి కోతలు ఎక్కడ మొదలైతే అక్కడ కేంద్రాలను దశలవారీగా ఏర్పాటుచేస్తాం. గత సీజన్లలో పెండింగ్‌లో ఉన్న ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వాహకుల కమీషన్ విషయమై సివిల్ సప్లయీస్‌కు ప్రతిపాదించాం. త్వరలోనే ఈ కమీషన్ నిర్వాహకులకు అందుతుంది.

– ఎస్.మధుసూదన్, అదనపు కలెక్టర్

లక్ష్యాలకు అనుగుణంగా బయోమైనింగ్



అధికారులకు సూచనలు చేస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్

ఖమ్మంమయూరిసెంటర్: డంపింగ్‌యార్డ్‌లో దశాబ్దాల కాలంగా నిల్వ ఉన్న వ్యర్థాలను లక్ష్యాలకు అనుగుణంగా బయోమైనింగ్ చేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని దానవాయిగూడెంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను కమిషనర్ గురువారం సందర్శించారు. డంపింగ్‌యార్డ్‌లో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ మెషిన్ల పనితీరును తెలుసుకున్నారు. అనంతరంఆయన మాట్లాడుతూ ఏళ్లుగా డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయని చెప్పారు. ప్రస్తుతం 2.67లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా.. బయో మైనింగ్ ద్వారా శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. రోజుకు 30 నుంచి 35 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. వ్యర్థాలు శుభ్రమయ్యాక ఈ స్థలంలో మొక్కలు నాటి ఉద్యానవనం ఏర్పాటు చేయాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరిని కమిషనర్ ఆదేశించారు. అనంతరం డంపింగ్‌యార్డ్‌లోని సెగ్రిగేషన్ షెడ్లు, ఇతర సముదాయాలను కమిషనర్ పరిశీలించారు. డీఈ నవ్యజ్యోతి, సిబ్బంది శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆపరేటర్ సతీష్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బయోమైనింగ్

న్యూస్‌రీల్

నేటి నుంచి సీపీఐ ప్రజాపోరు యాత్ర

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాచైతన్యం, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యాన చేపడుతున్న ప్రజాపోరు యాత్ర శుక్రవారం ప్రారంభమవుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లిలో ప్రారంభం కానున్న ఈ యాత్రలో తొలుత అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించాక సభ ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. బీజేపీ హఠావో–దేశ్‌కీ బచావో నినాదంతో చేపట్టిన ఈ యాత్రను సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ప్రారంభిస్తారని, తొలిరోజు సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల్లో యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు.

సీఎఫ్ చాంబర్‌లోకి డీఎఫ్ఓ కార్యాలయం



డీఎఫ్ఓ చాంబర్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా అటవీశాఖ అధి కారి(డీఎఫ్ఓ) చాంబర్, కార్యాలయాన్ని మరో భవనంలోకి మారుస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనం పక్కనే కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) విధులు నిర్వర్తించిన భవనంలోకి డీఎఫ్ఓ కార్యాలయాన్ని తరలిస్తున్నారు. సీఎఫ్ కార్యాలయాన్ని వరంగల్‌కు తరలించగా, ప్రస్తు తం డీఎఫ్ఓ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఎఫ్ఓ చాంబర్‌లో ఏర్పాట్లు గురువారం పూర్తయ్యాయి. ఈ భవనంలో 1965 నుండి 2021 ఫిబ్రవరి వరకు పలువురు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులు విధులు నిర్వర్తించగా, ఖమ్మం సర్కిల్ కార్యాలయాన్ని వరంగల్ తరలించడంతో ఖాళీ అయింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మం సహకారనగర్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం నుంచి జరగనుండగా, కలెక్టరేట్‌లో గురువారం ఆమె రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యాన రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం స్నేహలత మాట్లాడుతూ అగ్నిప్రమాదం వంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎలా రక్షించుకోవాలనే విషయాలపై అవగాహన అవసరమని తెలిపారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో ఉద్యోగులకు అవగాహన కల్పించేలా అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఎఫ్ఓ జయప్రకాష్, ఏడీఎఫ్ఓ రేమాండ్ బాబు, ఎస్ఎఫ్ఓ రాజేశ్వరరావు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు

చీమలపాడు బాధితులకు పొంగులేటి పరామర్శ

ఐదుగురికి రూ.25 వేల చొప్పున ఆర్థికసాయం



బాధితులను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవైద్యవిభాగం: కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడిన ఐదుగురు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు వారిని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున రూ.1.25 లక్షల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ సహాయ సహకారాలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు రాజ్యస్థాపనకు కృషి

తిరుమలాయపాలెం: కమ్యూనిస్టు రాజ్య స్థాపన కోసం సీపీఎం కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. మండలంలోని తాళ్లచెరువులో గురువారం జరిగిన సీపీఎం నాయకుడు జంపాల రామనాథ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. రామనాథం కోరుకున్న కమ్యూనిస్టు రాజ్యం కోసం కార్యకర్తలు పాటుపడాలన్నారు. పాలేరులో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ కలిసి పనిచేస్తాయని, ఎన్నికల వేళ అభ్యర్థి ప్రకటన ఉంటుందని వెల్లడించారు. పార్టీ నాయకులు బి.రమేష్, బషీరుద్దీన్, శ్రీను, నర్సయ్య, నాగేశ్వరరావు, వెంకన్న, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వ్యవసాయ రంగానికి పెద్దపీట

కల్లూరు: తెలంగాణలో ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం(శివాలయం) ఆవరణతో పాటు పాత పెంకు ఫ్యాక్టరీ సమీపాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన అదనపు కలెక్టర్ మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ కాకతీయ, 24గంటల విద్యుత్, రైతుబీమా, రైతుబంధు పథకాలతో అన్నదాతలను ఆదుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మొదటగా కల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు దశలవారీగా ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. డీఆర్డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, డీఎస్ఓ రాజేందర్, సర్పంచ్ పెద్దబోయిన కృష్ణవేణి, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, తహసీల్దార్ జె.బాబ్జీప్రసాద్, ఎంపీడీఓ బి.రవికుమార్‌తో పాటు బోబోలు లక్ష్మణరావు, బుర్రి భవాని, పాలెపు రామారావు, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, కాటమనేని వెంకటేశ్వరరావు, వెంకట్రామారావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, వి.నారాయణరావు, పి.సత్తిరెడ్డి, వెంకట్రావమ్మ, రామలక్ష్మి, సరిత, రమాదేవి, మాధవి, శివ పాల్గొన్నారు.

అంతా అనధికారికమే...

- ఉమ్మడి జిల్లాలో రెండు బాణాసంచా షాపులకే అనుమతి
- అయినా విచ్చలవిడిగా విక్రయాలు
- శుభకార్యాలు, రాజకీయ సభల్లో ఇష్టారీతిన వినియోగం
- అయినా పట్టించుకోని యంత్రాంగం
- చీమలపాడు ఘటనతో బయటపడిన అగ్నిమాపక శాఖ, పోలీసుల నిర్లక్ష్యం



చీమలపాడులో బుధవారం అగ్నిప్రమాదం జరిగిన గుడిసె ఆనవాళ్లు

ఖమ్మంక్రైం: ఏ చిన్న శుభకార్యమైనా.. రాజకీయ పార్టీల కార్యక్రమాలైనా బాణాసంచా వినియోగం తప్పనిసరిగా మారింది. సంబరాలకు ఇదో చిరునామాగా భావిస్తుండగా అమ్మకాలు, ఉపయోగానికి అనుమతి తీసుకోవాలనే విషయాన్ని అటు వ్యాపారులు, ఇటు ప్రజలు మరిచిపోయారు. ఇక బహిరంగ ప్రదేశాలు, రద్దీ కాంప్లెక్స్‌ల్లో బాణసంచా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నా అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులు తనిఖీల ఊసే ఎత్తడం లేదు. చీమలపాడు దుర్ఘటన నేపథ్యాన బాణాసంచా అమ్మకాలపై చర్చ జరుగుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం

కారేపల్లి మండలం చీమలపాడులో బాణసంచా పేలుస్తుండగా నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు అంటుకోవడం, ఆపై సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. కారణం బాణాసంచా పేల్చడమేనని వెల్లడైంది. ఇదేకాక బాణాసంచాను అన్ని వేడుకల్లో వినియోగిస్తున్నారు. కేవలం దీపావళి సమయంలోనే వివిధ శాఖల అనుమతితో బాణాసంచా అమ్మాల్సి ఉండగా.. మిగతా సమయాల్లో అమ్మకాలు ఎలా జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రెండు షాపులకే అనుమతి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేవలం రెండు బాణాసంచా దుకాణాలకు మాత్రమే విక్రయానికి అగ్నిమాపక శాఖ అనుమతి ఇచ్చింది. మధిర సరిహద్దులో ఈ దుకాణాలు ఉండగా ఇంకెక్కడా బాణాసంచా విక్రయానికి అనుమతి లేదు. ఎవరికి కావాలన్నా మధిర ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిందే. కానీ అక్కడే షాపులకు అనుమతి ఉందనే చాలా మందికి అవగాహన లేకపోగా, విచ్చలవిడిగా అమ్మకాలు, వినియోగం ఎలా జరుగుతుందన్నది తెలియరావడం లేదు.

అక్రమ నిల్వల నుంచే..

దీపావళి సమయంలో బాణాసంచా విక్రయించాక కొందరు వ్యాపారుల వద్ద భారీగా సరుకు మిగులుతుంది. వీటిని గోడౌన్లు, ఇళ్లు, షాపుల్లో నిల్వ చేసి అవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇలా అనుమతి లేకుండా నిల్వ చేయడం, అమ్మకాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఇల్లెందులో కొనుగోలు?

జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటి నమోదవుతున్నాయి. ఈ సమయాన బాణాసంచా వినియోగించడం అంటే ప్రమాదాలను కొనితెచ్చుకోవడమే. చీమలపాడు ఘటనలో పేల్చిన బాణాసంచా ఇల్లెందులోని అంబబజార్‌లో కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా అక్రమంగా బాణాసంచా అమ్ముతున్నట్లు సమాచారం.

రెండేళ్లుగా కేసులే లేవు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాణాసంచాను అక్రమంగా నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిసినా అగ్నిమాపక శాఖ కానీ పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కనీసం తనిఖీలు కూడా చేయడం లేదని తెలుస్తోంది. ఎవరెవరు బాణాసంచా విక్రయిస్తారనే విషయం తెలిసినా చూసీ చూడనట్టే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇళ్ల సమీపంలో నిల్వ చేసిన బాణాసంచా వేసవిలో ఎండ కారణంగా పేలితే భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశముంది. కాగా, గత రెండేళ్లలో అక్రమ నిల్వలపై కేసులు నమోదు కాకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

అక్రమ నిల్వలపై దృష్టి సారిస్తాం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మధిరలో మాత్రమే రెండు బాణాసంచా దుకాణాలకు అనుమతి ఉంది. చీమలపాడులో అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించాం. కారేపల్లితోపాటు, చుట్టు పక్కల మండలాల్లో అగ్నిప్రమాదం జరిగితే ఇల్లెందు అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్లు వెళ్తాయి. మా సిబ్బంది కూడా చీమలపాడు వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇలాంటి ప్రమాదాలు అరుదుగా జరుగుతాయి. ఈ నేపథ్యాన బాణాసంచా అక్రమ నిల్వలపై దృష్టి సారిస్తాం.

– జయప్రకాష్, అగ్నిమాపక అధికారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా

క్లుప్తంగా

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. చింతకాని మండలం జగన్నాథపురంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరుకానున్న ఆయన, ఖమ్మంలో జరిగే పలు శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించాక, కొత్తగూడెంలో జరిగే ఇఫ్తార్ విందులో పొంగులేటి పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

16న 'పెన్షన్' మార్చ్‌ను విజయవంతం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి ధర్నాచౌక్ వరకు ఈనెల 16న జరగనున్న పింఛన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్ నిర్వహించనున్నారు. ఈ మార్చ్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకంటి శశిధర్, రాయల కరుణాకర్ ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ విధానా(ఓపీఎస్)న్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఖాతా నుంచి రూ.1.43లక్షలు స్వాహా

మధిర: ఎలాంటి ఓటీపీలు, లింక్‌లకు స్పందించకుండానే ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయి. మండలంలోని దేశినేనిపాలెంకు చెందిన శాఖమూడి శ్రీనాథ్ ఒక కంపెనీలో ఉద్యోగిగా ఇంటి నుంచే పనిచేస్తున్నాడు. ఆయనకు మధిరలోని సెంట్రల్ బ్యాంకులో ఖాతా ఉండగా, ఏడు విడతలుగా రూ.1.43 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. దీంతో ఆయన సెంట్రల్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించి ఆయన సూచనతో గురువారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగేశ్వరరావు (ఫైల్)

పెనుబల్లి: అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గంగదేవిపాడుకు చెందిన తేజావత్ నాగేశ్వరరావు(33) కొన్నేళ్లుగా వ్యవసాయం, ట్రాక్టర్ల కొనుగోలుకు చేసి చేసిన అప్పులు పెరగగా, తీర్చే మార్గం లేకపోవడంతో బుధవారం గ్రామ సమీపంలోని మామిడి తోటలో పురుగుల మందు తాగాడు. తోట కాపరి తేజావత్ నాగేశ్వరరావు గురువారం ఉదయం ఆయన మృతదేహాన్ని గుర్తించి ఇచ్చిన సమాచారంతో వీఎం బంజర్ పోలీసులు చేరుకుని పంచనామా చేశారు. మృతుడి తల్లి ద్వాలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జి. సూరజ్ తెలిపారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన

కారేపల్లి: పెద్దల సమక్షంలో పెళ్లి నిశ్చయమై ఏడాది గడిచాక గొడవలతో పెళ్లి రద్దు కాగా.. ఆ యువకుడితో పెళ్లి జరిపించాలంటూ ఓ యువతి ఆందోళనకు దిగింది. కామేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన భూక్యా స్నేహలత, కారేపల్లి మండలం ఆల్యాతండాకు చెందిన గుగులోత్ కల్యాణ్‌కు గతేడాది పెళ్లి నిశ్చయమైంది. ఇటీవల ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలతో పెళ్లి రద్దయింది. కానీ స్నేహ మాత్రం కల్యాణ్‌తోనే పెళ్లి జరగాలని భీష్మించి కూర్చుంది. పదిహేను రోజుల క్రితం ఆమె యువకుడి ఇంటిముందు ఆందోళన చేయగా పోలీసులు సర్దిచెప్పారు. మళ్లీ గురువారం ఆందోళనకు దిగడంతో కల్యాణ్ కుటుంబీకులు తాళంవేసి వెళ్లిపోగా ఆమె మాత్రం అక్కడే ఉండిపోయింది.

అదుపు తప్పి ఫెన్సింగ్ రాళ్ల ట్రాక్టర్ బోల్తా

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

కామేపల్లి(కారేపల్లి): ఫెన్సింగ్ రాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టగా ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఈ ఘటన కామేపల్లి మండలం పండితాపురంలో చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లా అనంతగిరి గ్రామానికి చెందిన చిన్నం ప్రవీణ్(28)తోపాటు, అదే గ్రామానికి చెందిన సూరేపల్లి కిరణ్, నకిరికంటి సతీష్, మందా సందీప్, డ్రైవర్ నకిరికంటి బాబు అనంతగిరి నుంచి ట్రాక్టర్‌లో ఫెన్సింగ్ రాళ్లు తీసుకుని గురువారం కామేపల్లి మండలం ముచ్చర్ల వస్తున్నారు. పండితాపురం స్టేజీ వద్ద ఓ కారు మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ముందుకు వచ్చింది. ఇదే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయిన ట్రాక్టర్ డ్రైవర్ బాబు ట్రాక్టర్‌ను రోడ్డు కిందకు దించి మళ్లీ ఎక్కించే క్రమంలో ఇంజన్‌కు ట్రక్కు లింక్ ఊడిపోయి బోల్తా పడింది. దీంతో రాళ్లపై కూర్చున్న చిన్నం ప్రవీణ్‌పై రాళ్లు పడగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కిరణ్, సతీష్, సందీప్‌కు సైతం తీవ్రగాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కామేపల్లి ఏఎస్సై రాజు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

చిన్నబోయిన చీమలపాడు

- దుర్ఘటన నుంచి తేరుకోలేకపోతున్న గ్రామస్తులు
- ఎవరిని కదలించినా కన్నీళ్లే..
- ముగ్గురు మృతుల అంత్యక్రియలు పూర్తి

కారేపల్లి: బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం హడావుడి.. అంతలోనే గుడిసెకు నిప్పు, ఆపై భారీ పేలుడు శబ్దం.. ఏం జరిగిందో అర్థమయ్యేలోగా తెగిపడిన కాళ్లు, రక్తపు మరకలు, మాంసపు ముద్దలు.. ఇదీ కారేపల్లి మండలం చీమలపాడులో బుధవారం నాటి పరిస్థితి ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈమేరకు గ్రామంలో గురువారం పరిశీలించి ఎవరిని కదిలించినా ఆ భయానక ఘటనే కళ్ల ముందు కదులుతోందని చెప్పారు. ఊహించని విధంగా చోటు చేసుకున్న ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్న వారు అప్పటి వరకు తమతో గడిపిన వారు ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక కన్నీటి పర్యంతమవుతున్నారు.


కారేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కాలిపోయిన గుడిసె రాజన్నోల రాములుది

చీమలపాడులో బీఆర్ఎస్ కార్యకర్తలు బాణసంచా కాల్చగా నిప్పురవ్వలు పడి కాలిపోయిన గుడిసె రాజన్నోల రాములు(జక్కుల రాములు)ది. వీరు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు నెలల తరబడి వెళ్లి ఆయుర్వేద మూలికలు అమ్ముకుంటూ జ్యోతిష్యం చెబుతూ పొట్టపోసుకుంటారు. టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఘటన విషయంతెలుసుకున్న రాములు గురువారం వచ్చి చూసి వెళ్లినట్లు సమాచారం. కాగా, గుడిసె కాలిపోయిన ప్రాంతాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకుని విచారణ చేపట్టారు. సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా రిబ్బన్లు అమర్చారు. దీంతో నిన్న సభావేదిక, తోరణాలు, జనం రాకపోకలతో కళకళలాడిన ఆ ప్రాంతం ఇప్పుడు బోసిపోయి కనిపించింది.

కారేపల్లి బంద్ ప్రశాంతం

చీమలపాడు ఘటనకు బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీతో పాటు కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యాన గురువారం కారేపల్లి బంద్‌కు పిలుపునిచ్చారు. ఈమేరకు దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించగా, నాయకులు బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల అజాగ్రత్తతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై ప్రకాశ్, బోళ్ల రామస్వామి, కె నాగేశ్వరరావు, కె నరేందర్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, తురక నారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


కారేపల్లిలో బంద్‌తో మూసివేసిన దుకాణాలు

ఇంటి పెద్దను కోల్పోయాం...

గేటురేలకాయలపల్లి కి చెందిన బానోతు లక్ష్మా-సరోజ దంపతులకు నాలుగురు కుమార్తెలు కాగా సరస్వతి, బిందుకు వివాహమైంది. మిగతా వారిలో రాజేశ్వరి వారణాసి ఐఐటీలో, దుర్గ హైదరాబాద్‌లో ఐఐటీ చదువుతున్నారు. వీరు గురువారం గ్రామానికి చేరుకుని తండ్రి మృతదేహం పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. పెద్ద దిక్కును కోల్పోయిన తాము ఎలా బతకాలంటూ వారు రోదిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది. కాగా, లక్ష్మాకు నలుగురు కుమార్తెలు కావడంతో పెద్ద కుమార్తె సరస్వతి తలకొరివి పెట్టింది.

చీమలపాడు ఘటనపై కేసు నమోదు

చీమలపాడు ఘటనలో తీవ్రంగా గాయపడి, మృతి చెందిన అజ్మీరా మంగూ కుటుంబీకులు చేసిన ఫిర్యాదుతో కారేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మంగూ, పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చడంతో నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు లేవగా.. సిలిండర్ పేలుడుతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా మృతుడి సోదరుడు అజ్మీరా వాసు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఇంకా తేరుకోలేకపోతున్నాం



ప్రశాంతంగా ఉన్న ఊరు గ్యాస్ సిలిండర్ పేలుడుతో దద్దరిల్లిపోయింది. ఇంకా ఆ దారుణం నుంచి తేరుకోలేకపోతున్నాం. మా చీమలపాడు ఊరు ఈ దారుణంతో ఒక్కసారిగా మూగపోయినట్లయింది. ఈ దారుణాన్ని మర్చిపోయి మా ఊరు కోలుకోవాలంటే సమయం పడుతుంది.

– కటికుల బుచ్చన్న, చీమలపాడు

దిక్కులేని వారిగా మిగిలాం



నాతో పాటు డిగ్రీ చదువుతున్న కుమార్తె, ఇంటర్ చదువుతున్న కుమారుడు దిక్కులేని వారయ్యాం. రెండెకరాల పోడు భూమిపై ఆధారపడి జీవిస్తుండగా నా భర్త ఇప్పుడు లేకుండా పోయాడు. ఇప్పటికే నాలుగు ఆపరేషన్లు జరిగి ఏ పని చేయలేని నేను పిల్లలను ఎలా పెంచాలో తెలియడం లేదు.

– జ్యోతి, మృతుడు రమేష్ భార్య, స్టేషన్ చీమలపాడు

కూలినాలీ చేసుకుని బతుకుతున్నాం



కూలీనాలీ చేసుకుని బతికే మా కుటుంబానికి ఇంటి పెద్ద లేకుండా పోయాడు. ఇద్దరు కొడుకుల్లో ఉమేష్ ఐటీఐ పూర్తి చేయగా, గణేష్ 10వ తరగతి చదువుకున్నాడు. ఇద్దరు తండ్రికి చేదోడు వాదోడుగా కూలీ పనులకు వెళ్లేవారు. ఇప్పుడు తండ్రిని కోల్పోయిన బిడ్డలను ఎలా పెంచాలి.

– లలిత, మృతుడు మంగూ భార్య, చీమలపాడు

రేణుకాచౌదరిని అడ్డుకున్న పోలీసులు

కామేపల్లిలో పోలీసులతో వాగ్వాదం, ఘర్షణ

వైరా(కామేపల్లి)/కారేపల్లి/ఖమ్మం సహకారనగర్: కారేపల్లి మండలం చీమలపాడు ప్రమాద బాధితులను పరామర్శించేందుకు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి గురువారం వెళ్తుండగా కామేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సుమారు నాలుగు గంటలపాటు ఆమె ముందుకు వెళ్లకుండా బ్యారికేడ్లు, పోలీస్ వాహనాలను అడ్డుగా పెట్టి నిలిపివేశారు. అయితే, ఆమె వాహనం దిగకపోవడంతో ఇల్లెందు – ఖమ్మం రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కామేపల్లికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈక్రమంలో పోలీసులు, నాయకుల నడుమ తోపులాట జరగగా, రేణుకాచౌదరి పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనలో పోలీసులకు గాయాలైనట్లు చేసిన ఫిర్యాదుతో ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. ప్రమాదానికి కారణమైన ఎమ్మెల్యే రాములునాయక్, ఎంపీ నామా నాగేశ్వరరావుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె పోలీసుల కన్నుకప్పి ఇల్లెందు మీదుగా గేటురేలకాయలపల్లి వెళ్లి లక్ష్మా కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో రేణుకాచౌదరి విలేకరులతో మాట్లాడుతూ మానవత్వం కాదు.. కనీసం సానుభూతి లేని పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు. చీమలపాడు ఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చినట్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయిస్తే ఈ ప్రమాదం జరగకపోయేదని చెప్పారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు యడవల్లి కృష్ణ, ధరావత్ రామ్మూర్తినాయక్, కట్ల రంగారావు, నున్నా రామకృష్ణ, పగడాల మంజుల, సూరంపల్లి రామారావు, మాధవీరెడ్డి, మిక్కిలినేని నరేందర్, మానవతారాయ్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కన్నేటి వెంకన్న, ధరావత్ భద్రునాయక్, మంగీలాల్, నాగార్జున, వీరబాబు, గోపీ, కట్ల నాగరాజు, శ్రీనివాసరావు, లెనిన్‌బాబు, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సూరంపల్లి రామారావు, కట్ల రంగారావు, దివ్వెల కృష్ణయ్య, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చీమల వెంకటేశ్వర్లు, ధరావత్ భద్రు, గడ్డం వెంకటేశ్వర్లు, ఈసాల ఛాయాదేవి, బావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


కామేపల్లిలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన రేణుకాచౌదరి

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: మండలంలోని చీమలపాడు ఘటనలో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలను గురువారం ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ పరామర్శించారు. చీమలపాడులో అజ్మీరా మంగూ, స్టేషన్ చీమలపాడులో బానోతు రమేష్, గేటురేలకాయలపల్లిలో ధరంసోత్ లక్ష్మా కుటుంబాలను పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చొప్పున ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్

శవ రాజకీయాలు చేసేందుకు వస్తున్నారు

కొందరు శవ రాజకీయాలు చేసేందుకు వస్తున్నప్పటికీ.. చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్సీ తాతా మధు వెల్లడించారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వివరాలు తెలుసుకున్నారని, ప్రభుత్వం, పార్టీ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుకుంటామని చెప్పినట్లు తెలిపారు. కాగా, గేటురేలకాయలపల్లిలో ధరంసోత్ లక్ష్మా మృతదేహం వద్ద నివాళులర్పించేందుకు సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం నాయక్ తదితరులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే, తామేమి గొడవ చేయబోమని చెప్పడంతో అనుమతించారు. అలాగే, గేటురేలకాయలపల్లిలో ధరంసోత్ లక్ష్మా కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు బాగం హేమంతరావు, యర్రా బాబు, సీతామహాలక్ష్మి, ఉంగరాల సుధాకర్, ధన్‌రాజ్‌తో పాటు విజయాబాయి తదితరులు పరామర్శించారు.

మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

ఖమ్మంమయూరిసెంటర్: చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో బీఎస్పీ నాయకులు గురువారం ఖమ్మంలో మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేందర్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులను శిక్షించడమే కాక బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తొలుత జెడ్పీసెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఎస్పీ నాయకులు పీ.సీ.వీరస్వామి, ఎం.పుల్లయ్య, బుర్ర ఉపేందర్, మిర్యాల నాగరాజు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, ఉప్పల మంజుల, శ్రీకాంత్, పి.విజయ్, అల్లిక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న బీఎస్పీ నాయకులు

జిల్లా గ్రంథాలయంలో కవిసమ్మేళనం

ఖమ్మంగాంధీచౌక్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు, రాజ్యాంగ రచనలో ఆయన సేవలను వివరిస్తూ పలువురు కవితలు వినిపించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. కవులు లెనిన్ శ్రీనివాస్, చిలుకబత్తిన వీరబాబు, చాగంటి కృష్ణమూర్తి, ఎల్.శ్రీనివాస్, వంశీ భార్గవకిషోర్, ఎన్.కాంతేశ్వరరావు, గాజుల భారతి, బి.శ్రీకాంత్, మందుల వీరభద్రం, నల్ల కృష్ణమూర్తి, జి.శోభనాద్రి, యడవల్లి శైలజ, రెంటాల హుస్సేన్‌ను సన్మానించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.అర్జున్, ఉద్యోగులు కేవీఎస్ఎల్ఎన్.రాజు, ఎండీ.ఇమాం, జె.భాస్కర్‌రావు, అఖిల్, ఆర్.నాగన్న, అఖిల్, ఏ.కనకవల్లి, ఎస్.లలితకుమారి, కె.రవిబాబు, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కవులతో గ్రంథాలయ చైర్మన్, ఉద్యోగులు

ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

నిందితుల్లో ఇద్దరు ఖమ్మం వాసులు

వరంగల్ క్రైం: వరంగల్ ఓ సిటీ కేంద్రంగా ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువతులతో సహా మొత్తం ఆరుగురి ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు వివరాలను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ గురువారం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయచూర్‌కు పఠాన్‌బాబు, పఠాన్ ఖాసిం ఖాన్, ఒడిశాకు చెందిన చాందిన నాగ్, సయ్యద్ సల్మాబేగ్, ఖమ్మానికి చెందిన మొగల్ మున్నా, గుంజ కళ్యాణ్ ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం బెట్టింగ్‌కు తెరలేపి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను ఎంపిక చేసుకున్నారు. ఐపీఎల్ ప్రారంభం కావడంతో బెట్టింగ్‌లో పాల్గొనేవారి నుంచి ముందుగా ఆన్‌లైన్‌లో కొంత మొత్తం డబ్బు తీసుకుని యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఇచ్చేవారు. గెలిచిన వారికి రెండింతల డబ్బు ఇస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ ముఠా గతంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోనూ కూడా బెట్టింగ్ నిర్వహించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఓ సిటీలోని ఓ ఇంట్లో బెట్టింగ్ కేంద్రంపై మిల్స్ కాలనీ పోలీసులు దాడి చేసి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకోవడమే కాక మూడు ల్యాప్‌టాప్‌లు, 13 సెల్‌ఫోన్లు, రూ.1.90 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, డెబిట్, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. ముఠాను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, సీఐలుముస్కా శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, సైబర్ ఏఏఓ ప్రశాంత్, ఎస్సై కుమార్, సిబ్బంది స్వరూప, బావుసింగ్, వీరన్న, నాగేశ్వరరావును డీసీపీ బారీ ఈ సందర్భంగా అభినందించారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, నగదు, ఫోన్లు

సాగర్ కాల్వలో చెరుకు కూలీ గల్లంతు

నేలకొండపల్లి: చెరుకు తోటల్లో కోతకు వచ్చిన వలస కూలీ సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లల చెరువు గ్రామానికి చెందిన 11మంది మండలంలోని రాజేశ్వరపురంలో చెరుకు తోటలు నరికేందుకు వచ్చారు. ఫ్యాక్టరీ పరిధిలోనే గుడిసెలు ఉంటుండగా, వీరిలో ఏసయ్య(42) తన భార్య మరియమ్మతో కలిసి బట్టలు ఉతికేందుకు రాజేశ్వరపురంలోని సాగర్ కాలువ వద్దకు వెళ్లారు. అక్కడ ఏసయ్య స్నానం చేసేందుకు దిగే క్రమంలో కాలు జారి కొట్టుకుపోయాడు. పక్కన ఉన్న స్థానికులు ఆయనను కాపాడేందుకు యత్నించినా వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సాధ్యం కాలేదు.

ప్రమాదవశాత్తు జారి పడి మృతి

కల్లూరు: కల్లూరు మండలం మర్లపాడు వద్ద ఎన్నెస్పీ కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. జనగామ జిల్లా కొడవటూరుకు చెందిన కుక్కా సాయి ఆంజనేయులు(45) వరికోత మిషన్ వెంట కూలి పనుల కోసం పది రోజుల క్రితం వచ్చాడు. ఇక్కడే ఉంటున్న ఆయన గురువారం కాల్వ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారగా కాల్వలో పడి మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

పెనుబల్లి : లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. కల్లూరులోని మల్లేశ్వరి రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్న అన్నపురెడ్డి నాగరాజు (24) తన ద్విచక్రవాహనంపై కల్లూరు నుండి సత్తుపల్లిలో ఉంటున్న తన అక్క వద్దకు గురువారం బయలుదేరాడు. మధ్యలో పెనుబల్లి మండలం అడవిమల్లెల క్రాస్ సమీపాన సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈక్రమంలో నాగరాజు వాహనాన్ని లారీ సుమారు 300 మీటర్ల మేర లాక్కెళ్లింది. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి...

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన బొమ్మనబోయిన ప్రసాద్(59) గురువారం చెరువులో పడి మృతి చెందాడు. కొంతకాలంగా చెరువు వద్దకు కాపలా వెళ్తున్న ఆయన ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడా, ఇంకా ఏదైనా కారణాలు ఉన్నాయా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మార్గదర్శి కేసులో పారదర్శకంగా దర్యాప్తు

- చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం
- సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలికి తీయడమే తమ లక్ష్యమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం మౌన ప్రేక్షకులుగా ఉండరాదని 2011లో ఓ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తిస్తూ చట్టబద్ధ సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం, ఉద్యోగులు నిబంధనల రికార్డులు, డాక్యుమెంట్లు సీఐడీకి అందచేసి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు. గతంలో శ్రీరామ్ చిట్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా తమకు ప్రామాణికమన్నారు.

రుషికొండలో ఉల్లంఘనల్లేవ్

హైకోర్టుకు నివేదించిన కేంద్ర సంయుక్త కమిటీ

సాక్షి, అమరావతి: రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా విశాఖలోని రుషికొండపై చేపడుతున్న నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవని హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కమిటీ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం నివేదికను కమిటీ బుధవారం హైకోర్టుకు సమర్పించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతించిన మేరకు 9.88 ఎకరాల ప్రాంతంలోనే ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ రుషికొండ రిసార్ట్ ప్రాజెక్టు భవనాలను చేపట్టిందని తెలిపింది. వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఎలాంటి ఉల్లంఘనలు లేవని కమిటీ తేల్చింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ హై కోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం దాదాపుగా సరిపోతున్నట్లు పేర్కొంది. మట్టిడంప్ ప్రాంతమే అథారిటీ పేర్కొన్న దానికన్నా కొంచెం ఎక్కువగా ఉందని, అయితే నిర్మాణం పూర్తయిన తరువాత డంప్ చేసిన మట్టిని తొలగిస్తారని కమిటీ తెలిపింది.

విచారణకు సహకరించాల్సిందే

మార్గదర్శి ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

- తనిఖీలు ఆపేలా ఉత్తర్వులివ్వలేం
- మీడియాకు వివరాల వెల్లడిపైనా జోక్యం చేసుకోలేం
- విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారుల విచారణకు మార్గదర్శి ఉద్యోగులు సహకరించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేంద్ర కార్యాలయ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయస్థానం.. తనిఖీలు, విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. మీడియాకు అధికారులు వివరాలు వెల్లడించకుండా కూడా జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మార్గదర్శి కేంద్ర కార్యాలయ ఉద్యోగులపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తనిఖీలు ముగిశాక పిటిషనా?

మార్గదర్శి ఉద్యోగులు గురువారం లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోకుండా నిరోధించాలని, తనిఖీలు నిలిపివేసేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విన్నవించారు. అయితే బుధవారం ప్రారంభమైన తనిఖీలు గురువారం ఉదయం 9 గంటలకే ముగిశాయని, అలాంటప్పుడు తనిఖీలు ఆపాలని పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఏపీ స్పెషల్ జీపీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. 'సీఐడీ అధికారుల తనిఖీలు ముగిశాయి. ఏ ఉద్యోగిపైనా చర్యలు తీసుకోలేదు. ఎవరినీ బలవంతపెట్టలేదు.. భయపెట్టలేదు. అరెస్టులు చేయలేదు. చట్టప్రకారమే తనిఖీలు జరిగాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదు. పలువురు బ్రాంచ్ మేనేజర్లకు, బ్రాంచ్ ఉద్యోగులకు నోటీసులిచ్చాం. కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు' అని హైకోర్టుకు నివేదించారు.

విచారణలో జోక్యం వద్దన్న 'సుప్రీం'..

'ఏ–1 రామోజీరావు, ఏ–2 శైలజ సహా పలువురు మేనేజర్లు ముందస్తు బెయిల్ పొందారు. వారిని కనీసం కస్టడీకి తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. చట్టబద్ధమైన సంస్థలు కేసును విచారించే సమయంలో పూర్తి వివరాలను పరిశీలించకుండా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీం కోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చింది. నిహారికా ఇన్‌ఫ్రా. వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుపై విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 438 సీఆర్‌పీసీ కింద ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వకూడదని పేర్కొంది. పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి 'వెకేట్' పిటిషన్ దాఖలు చేసుకోవాలని ప్రతివాదులను ఆదేశించడం సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి రిలీఫ్ ఉత్తర్వులు ఇవ్వవద్దు' అని గోవిందరెడ్డి అభ్యర్థించారు.

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే



కేంద్ర సహాయ మంత్రితో సమావేశమైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. గురువారం విశాఖ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ కంటే ముందు ఆర్‌ఐఎన్‌ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూర్తి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియపై దృష్టి సారించామని తెలిపారు. గనుల సమస్యను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటిపై ఆర్‌ఐఎన్‌ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆయన నోవోటెల్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం చేసిన ప్రకటనపై మరింత క్లారిటీ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్లాంట్‌ను మరింత బలోపేతం చేస్తామని మాత్రమే మీడియాకు చెప్పానన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చేలా సహకరిస్తామన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

సింగరేణిలో ఆంధ్ర వాటా తేల్చండి

బీఆర్‌ఎస్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయంగా వినియోగించుకుంటోందని ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ అన్నారు. సింగరేణి గనుల్లో ఆంధ్ర రాష్ట్రానికి వాటా ఉందని, ముందు ఆ వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై బీఆర్‌ఎస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే పోలవరానికి సహకరించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు.

ఇంకా ఎన్నాళ్లీ విచారణ?

- సీబీఐ న్యాయవాదిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- వివేకా హత్య కేసులో తదుపరి విచారణ 17కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు అయ్యిందని.. ఇంకా ఎన్నాళ్లు విచారిస్తారని సీబీఐని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. హత్య కేసును కూడా ఇన్నాళ్లు సాగదీస్తే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చెప్పినట్లు ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున నాగేందర్ వాదనలు వినిపించారు.

కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ..

'గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలం తప్ప కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు. వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఇక్కడే ఉండి.. నా ఫోన్‌ను మరో చోటకు తీసుకుపోతే నేను అక్కడ ఉన్నట్లు కాదు. కాబట్టి గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణనలోకి తీసుకోలేం. ఇలాంటి పరిస్థితిలో వారిని వేధింపులకు గురి చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటికే సీబీఐ వారిని పలుమార్లు విచారణకు పిలిచింది. వారు కూడా పూర్తిగా విచారణకు సహకరించారు. ఎర్ర గంగిరెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ ఇప్పటివరకు రికార్డు చేయలేదు. సీబీఐ.. దర్యాప్తును ఇంకా సాగదీస్తోంది. కారణం ఏంటో తెలియడం లేదు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలైనా దర్యాప్తు ఆపాలని ఏ ధర్మాసనం చెప్పలేదు. దర్యాప్తు అధికారి కేసును తప్పుదారి పట్టిస్తుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక కిరాయి హంతకుడిని అరెస్టు చేయకుండా బెయిల్‌కు సహకరించిన విచారణను ఏమనాలి? కేవలం కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ సాగుతోంది తప్ప.. సాక్ష్యాలు సేకరించే పని చేయడం లేదు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వైఎస్ భాస్కర్ రెడ్డి, ఇతరులు (నిందితులుగా లేని వారు) పరారీలో ఉన్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదు.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు అని సీబీఐ తరఫు న్యాయవాది నాగేందర్ తెలిపారు. కోర్టులో పిటిషన్ల కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందన్నారు. దర్యాప్తు అధికారికి.. కోర్టు పిటిషన్లతో ఏం సంబంధం.. ఆయన విచారణ కొనసాగించవచ్చు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సుప్రీంకోర్టు.. దర్యాప్తు పూర్తి చేయడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. ఇది హత్య మాత్రమే కాదని.. హత్య ద్వారా లబ్ధి పొందేందుకు కుట్ర జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

విహరించే వనంపై మోహరించిన అవినీతి

- కేబీఆర్ పార్క్‌ను కనుమరుగు చేసే కుట్ర
- మంత్రి డెవలపర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతి
- కేటీఆర్ మిత్రుల కోసం నిబంధనలు గాలికి
- రాజయ్యను బర్తరఫ్ చేసినట్లు కేటీఆర్‌నూ చేయాలి
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబం ధన దాహంతో దశాబ్దాల చరిత్ర కలిగిన కేబీఆర్ పార్కును కనుమరుగు చేసే కుట్రకు తెరతీసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీ హిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులివ్వడమంటే హైదరాబాద్ నగరంలో విధ్వంసం సృష్టించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. 16 మంది సీఎంలు కఠిన నిబంధనలు పెట్టి కాపాడిన చరిత్రాత్మక వారసత్వ సంపద కలిగిన పార్కును ఈ ప్రభుత్వ పెద్దలు ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కేటీఆర్ స్నేహితుల కోసం చేస్తున్న ఈ ఆగడాలను కేసీఆర్ వెంటనే అడ్డుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు. మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేసినట్టు కేటీఆర్‌ను కూడా వెంటనే బర్తరఫ్ చేయాలని, అప్పుడే కేసీఆర్‌కు పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

''2012లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ అక్కడ మూడు అంతస్తుల నిర్మాణానికే అనుమతి ఇచ్చింది. కానీ 2016లోని టీఆర్ఎస్ సర్కారు మంత్రి డెవలపర్స్‌కి జీ ప్లస్ 7 ఫ్లోర్లకు అనుమతిచ్చేసింది. ఇక మంత్రి డెవలపర్స్‌లో ఆర్ఎస్ఆర్ డెవలపర్స్ భాగస్వాములు అయ్యాక 12 అంతస్తులకు దరఖాస్తు చేసుకుంటే దానికి కూడా అనుమతిచ్చేశారు. ఇప్పుడు ఏకంగా 15 అంతస్తులకు కూడా అనుమతిచ్చేశారు ''అని రేవంత్ వివరించారు.

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతి ఎక్కడైనా ఉందా?

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతిచ్చారని.. ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీరు తవ్విన గోతుల్లోనే మిమ్మల్ని పాతిపెడతామంటూ రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వాళ్లకు ఆంధ్రానే దిక్కని.. ఆపై బంగాళాఖాతమేనని వ్యాఖ్యానించారు. కేబీఆర్ పార్క్ దగ్గరకు వచ్చే వాకర్స్ అసోసియేషన్ ప్రజాప్రయోజన వాజ్యం వేయాలని కోరారు. రెండు మూడు రోజులు తర్వాత మరిన్ని వివరాలతో మీడియా ముందుకు వస్తానని రేవంత్ చెప్పారు.

జిల్లా వార్తలు


వరంగల్ నిట్ నుంచి డాక్టరేట్



హితవాణి

మధిర: మధిరకు చెందిన జక్కేపల్లి హితవాణికి వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) నుంచి డాక్టరేట్ లభించింది. రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.వి.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ఆమె జీన్ డెలివరీ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. నిట్‌లోనే ఎమ్మెస్సీ పూర్తిచేసిన హితవాణి డాక్టరేట్ అందుకోగా, ఆమె భర్త డాక్టర్ జక్కేపల్లి పవన్‌కుమార్ కూడా నిట్ నుంచే గతంలో డాక్టరేట్ స్వీకరించారు. ఈ సందర్భంగా హితవాణిని మధిర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు వేమవరపు వెంకటేశ్వరశర్మ తదితరులు అభినందించారు.

ఎస్సెస్సీ 'స్పాట్' ప్రారంభం



రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో క్యాంపు ఏర్పాటుచేయగా, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు రిపోర్ట్ చేశారు. రోజుకు ఒక్కో ఎగ్జామినర్ 40 జవాబుపత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా 'స్పాట్' విధుల పట్ల ఉపాధ్యాయులు ఆసక్తి చూపించడం లేదన్నారు. పలువురు వివిధ కారణాలను చూపుతూ విధులు రద్దు చేయించుకోగా, కొత్త వారికి కేటాయించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఆభరణాల అమ్మకం ఆరోపణలపై విచారణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో ఆభరణాలు పూజారి విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలతో గురువారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన విచారణ చేపట్టారు. దేవాలయం రికార్డులు, ఆభరణాలు పరిశీలించి అన్నీ ఉన్నట్లు తేలడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నేలకొండపల్లిలో భీమేశ్వరస్వామి ఆలయ భూముల వివాదంపై విచారణ చేపట్టారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ పి.నారాయణచార్యులు, అర్చకులు మధుసూదనాచార్యులు, శివయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీకి వడదెబ్బ!



గురువారం మధ్యాహ్నం వెలవెలబోతున్న కొత్తగూడెం బస్టాండ్

- ఎండలతో తగ్గుతున్న ప్రయాణికుల సంఖ్య
- మధ్యాహ్నం వేళ బస్సులు, బస్టాండ్లు ఖాళీ
- నాలుగు రోజులుగా పడిపోతున్న ఆదాయం



ఖమ్మం వెళ్లే బస్సులో అరకొరగా ప్రయాణికులు

చుంచుపల్లి: ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని భావిస్తున్న ఆర్టీసీపై భానుడు తన పంజా విసురుతున్నాడు. నష్టాల బారి నుంచి బయటకు వస్తోందని భావిస్తుండగా.. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ఆర్టీసీపై పడింది. మండుతున్న ఎండల దృష్ట్యా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేందుకు జనం వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా ఎండలు మండిపోతుండగా, ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 43 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుండగా ప్రయాణాలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళ ప్రజలెవరూ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కకపోవడంతో అటు బస్టాండ్లు, ఇటు బస్సులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏప్రిల్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకపోగా.. ఎక్కువ మంది ఉదయం లేదా రాత్రి వేళల్లోనే బస్సెక్కుతున్నారు. ఇంకొందరు చార్జీ ఎక్కువైనా సరే అని ఏసీ బస్సులను ఆశ్రయిస్తుండగా ఆ బస్సులకు డిమాండ్ పెరిగింది. గత నాలుగు రోజులుగా ఆర్టీసీలో ప్రయాణికులు సంఖ్య అమాంతం తగ్గడంతో ఆదాయం గణనీయంగా పడిపోతోంది.

ఆదాయం తగ్గిపోతోంది..



ఇటీవల పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభావం ఆర్టీసీపై కూడా పడింది. ఎండల తీవ్రతతో నాలుగు రోజులుగా ఆర్టీసీలో ప్రయాణాలు తగ్గుతున్నాయి. ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలెవరూ రావడం లేదు. దీంతో ఆర్టీసీ రోజువారీ ఆదాయం గణనీయంగా పడిపోతోంది. ఉదయం, రాత్రివేళ ప్రయాణానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

– బి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్, కొత్తగూడెం

డిపోకు రూ.2 లక్షలపైనే గండి

ఏప్రిల్‌లోనే నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు రావడం లేదు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి హైదరాబాద్ రూట్‌కు నిత్యం ఎక్కువ సర్వీసులు నడుస్తాయి. ఆయా డిపోల నుంచి సాధారణ రోజుల్లో నిత్యం లక్షకు పైగా జనం ప్రయాణిస్తారు. కానీ ఎండలతో ఈ సంఖ్య పడిపోగా.. పగటి వేళ బస్సులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అటు ఆర్టీసీ ఉద్యోగులు సైతం మండే ఎండలను తట్టుకోలేకపోతున్నారు. నాలుగు రోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని వారు చెబుతున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు చేసేదేం లేక మధ్యాహ్నం సర్వీసులు తగ్గించి ఉదయం, రాత్రి వేళ పెంచడంపై దృష్టి సారించారు. కాగా, గడిచిన నాలుగు రోజులుగా భానుడి ప్రభావంతో ఒక్కో డిపో పరిధిలో సగటున రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో రోజువారీ ఆదాయం అంచనా రూ.1,09,81,000 కాగా, ఈనెల 11వ తేదీన రూ.91,81,842, 12న రూ.85,53,615 మాత్రమే నమోదైంది.

గడిచిన రెండు రోజుల్లో డిపో వారీగా ఆదాయ(రూ.ల్లో)

డిపో	రోజువారీ లక్ష్యం	11వ తేదీ	12వ తేదీ
ఖమ్మం	30,35,000	23,88,811	22,08,602
మధిర	11,53,000	10,58,177	9,31,116
సత్తుపల్లి	19,14,000	15,60,075	15,13,465
భద్రాచలం	20,87,000	17,94,880	17,28,103
కొత్తగూడెం	12,42,000	10,91,446	8,95,693
మణుగూరు	15,50,000	12,88,453	12,76,636

లక్ష్యాలు సాధించిన డీసీసీబీ మేనేజర్లకు సత్కారం

ఖమ్మంవ్యవసాయం: బంగారం రుణాల, డిపాజిట్ల సేకరణ లక్ష్యాలను సాధించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలోని మేనేజర్లను గురువారం సన్మానించారు. ఖమ్మంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లను బ్యాంక్ చైర్మన్ కూరాకుల నాగభూషణం సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాల లక్ష్యాలను అశ్వారావుపేట, దమ్మపేట, పేరూరు, చింతకాని బ్రాంచ్ మేనేజర్లు అనూష, సత్యనారాయణ, దామోదర్‌రావు, మంజూష, డిపాజిట్ల సేకరణలో ఖమ్మం గట్టయ్య సెంటర్, దమ్మపేట మేనేజర్లు సృజన, సత్యనారాయణ లక్ష్యాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ అట్లూరి వీరబాబు, జనరల్ మేనేజర్లు పద్మావతి, నర్మద తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న మేనేజర్లతో డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

కలెక్టర్ చొరవతో 60 ఏళ్ల కల సాకారం



రహదారి వెంట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీతో ప్రజాప్రతినిధులు, అధికారులు

- మధ్యగుంపునకు రహదారి ఏర్పాటు
- 'అనుదీప్ గుంపు'గా గ్రామస్తుల నామకరణం

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సరైన రహదారి సౌకర్యం లేని గ్రామాలు ఇప్పటికీ కనిపిస్తాయి. అలాగే ఒకటి కాదు రెండు కాదు.. 60 ఏళ్లుగా ఆ గ్రామస్తులు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. ఎందరు అధికారులు మారినా సమస్య పరిష్కారం కాకపోగా ప్రస్తుత కలెక్టర్ చొరవతో రహదారి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తమ గ్రామానికి 'అనుదీప్ గుంపు'గా నామకరణం చేసి కృతజ్ఞత చాటుకున్నారు. దుమ్ముగూడెం మండలంలోని సుబ్బారావుపేటలో మధ్యగుంపులో 200 మందికి పైగా ప్రజలు ఉండగా.. బయటకు రావడానికి రహదారి సౌకర్యం లేక పొలం గట్లపై నుంచి నడవాల్సి వచ్చేది. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి నెలకొనగా.. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు వెళ్లాలంటే ఇక్కట్లు ఎదుర్కొనేవారు. ఈక్రమంలో పొలం యజమాని, గ్రామస్తుల నడుమ పలుసార్లు వాగ్వాదం జరిగింది. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓ చంద్రమౌళి రంగంలోకి దిగి రైతు, ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడి గ్రామంలోకి వెళ్లడానికి పొలం నుండి ఎనిమిది అడుగుల వెడల్పుతో 200 మీటర్ల పొడవున స్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. ఆ స్థలంలో చెట్లు, రాళ్లు తొలగించి గురువారం రహదారి పనులు మొదలుపెట్టగా.. స్థానికులు అనుదీప్ గుంపుగా నామకరణం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. అలాగే, రహదారికి కోసం స్థలం ఇచ్చిన రైతును సన్మానించగా ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీఓ ముత్యాలరావు, సర్పంచ్ వర్షా చిన్నారావు, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలకు దూరం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని చీమలపాడులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనతో పాటు తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు అనారోగ్యం దృష్ట్యా ఈనెల 19న తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జన్మదిన సంబరాలకు బదులు ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సాయం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. చీమలపాడు ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు.

అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలంఅర్బన్: మారుమూల గిరిజన గ్రామాల్లో ఆవాసాలకు బీటీ రోడ్ల నిర్మాణం, అటవీ అనుమతుల కోసం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేపట్టి ప్రతిపాదనలు సమర్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా బీటీ రోడ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, ములకలపల్లి, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రహదారులు అవసరమైన ఆవాసాలను గుర్తించి అటవీ అనుమతులపై దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఉమ్మడి సర్వే చేసి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ఈసమీక్షలో ఆర్‌అండ్‌బీ ఈఈ హరిలాల్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఆర్‌ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్‌తో పాటు అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్